
సాక్షి ఒడిశా

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.7.92.624

బంగారం : 500 మిల్లీ గ్రాములు

వెండి : 175 గ్రాములు 750 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

సహస్ర లింగాల సమాహారం..



కుటినిపాదారొ శైవక్షేత్రం వెయ్యి శివలింగాలతో భక్తులకు కనువిందు చేస్తోంది. పర్యాటక ప్రాంతంగానూ ప్రసిద్ధి చెందుతోంది.

- 8లో



అన్నదాతకు ఓదార్పు

అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లడంతో తల్లడిల్లుతున్న రైతులకు సీఎం, మంత్రులు భరోసా కల్పిస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

జన్మదిన వేడుకలను రద్దు చేసుకున్న జయపురం ఎమ్మెల్యే



బాహిణీపతి

జయపురం: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అకాల మరణానికి చింతిసూ ఈ నెల 30వ తేదీన తన జన్మదిన వేడులను రద్దు చేసుకున్నట్టు జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా అభిమానులు, బంధు మిత్రులు, పార్టీ శ్రేణుల సమక్షంలో పుట్టిరోజు వేడుకలను ఘనంగా జరుపుకునేవాళ్లమన్నారు. ఈసారి వేడులను రద్దు చేసుకున్నాని.. ఎవరూ శుభాకాంక్షలు తెలియజేయడానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు విద్యార్థులు అదృశ్యం



అదృశ్యమైన విద్యార్థులు

కొరాపుట్: ట్యూషన్ కోసం వెళ్లిన ముగ్గురు విద్యార్థులు అదృశ్యం అయ్యారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి పోలీస్ స్టేషన్ పరిధి లడ్‌గాంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రద్యుమ్న నారాజి, అరుణ్ పాలీ, కె.సునీల్ ట్యూషన్ కోసం వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాక పోవడంతో విద్యార్థుల తల్లి దండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

అడ్డుకున్నా.. ఆగలేదు..!

- రైలుకిందపడి వ్యక్తి బలవన్మరణం



శివరామ్ యాదవ్ మృతదేహం

రాయగడ: రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని అక్కడ ఉన్నవారు అడ్డుకున్నప్పటికీ విషాదం తప్పలేదు. అక్కడకు కొద్ది క్షణాల్లోనే మరో రైలుకింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ విషాద ఘటన రాయగడ మజ్జిగౌరి మందిరానికి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాయగడ మజ్జిగౌరి అమ్మవారిని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఖైతపతి గ్రామానికి చెందిన శివరామ్ యాదవ్ (46) దర్శించుకున్నాడు. అనంతరం పూటుగా మద్యం తాగి ఆత్మహత్య చేసుకోవడానికి సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లాడు. అయితే సమీపంలో ఉన్న కొంతమంది అతన్ని గమనించి అడ్డుకొని అక్కడ నుంచి తీసుకొని వచ్చేశారు. అయితే అక్కడకు కొద్ది సేపటి తరువాత మరో గూడ్స్ రైలు వస్తుండగా పరుగున వెళ్లి దాని కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుక్ను రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

దక్షిణకాళి, పాతాళేశ్వర మందిరాల్లో చోరీ



దక్షిణ కాళి ఆలయం



పాతాలేశ్వర మందిరం

రాయగడ: జిల్లాలోని తెరువలి పంచాయతీ పాయికొపాడ గ్రామంలోని దక్షిణకాళి, పాతాళేశ్వర మందిరాల్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు మందిరాల్లో చొరబడి హుండీల్లోని సుమారు 15 వేల రుపాయల నగదుతో పాటు 500 గ్రాముల వెండి ఆభరణాలను దొంగిలించినట్లు చందిలి పోలీసులకు గ్రామస్తులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎప్పటిలాగే పూజారి మందిరాల తలుపులను ఆదివారం తెల్లవారుజామున తెరిచేందుకు వెళ్లారు. అయితే అప్పటికే మందిరాలకు వేసి ఉన్న తలుపులు తెరచి ఉండడంతో పాటు తాళాలు విరిగి కింద పడి ఉండటాన్ని గమనించారు. దీంతో చోరీ జరిగి ఉంటుందనే అనుమానంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. చందిలి పోలీస్ స్టేషన్ ఐఐసీ ప్రసన్నకుమార్ బెహెర, సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

తెల్లారిన బతుకులు

- ఆదివారం వేకువజామున విషాదం
- గుప్తేశ్వర్ మార్గంలోని డొంకిఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- లోయలో పడిన ట్రావెల్స్ బస్సు

బాలికతో సహా ఐదుగురు దుర్మరణం



సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది



బస్సు నుంచి క్షతగాత్రులను బయటకు తీసుకొస్తున్న బీఎస్‌ఎఫ్ జవానులు



ప్రమాదానికి గురైన బస్సు



బోల్తాపడిన బస్సు



సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది పోలీసులు

జయపురం: ఆదివారం తెల్లవారుజాము 5.45 గంటల సమయం. 65 మంది యాత్రిలతో బస్సు దూసుకుపోతోంది. మరికొద్ది సమయంలో గమ్యస్థానం చేరుకుంటుందనేలోగా ఒక్కసారిగా కుదుపు. ఏం జరిగిందో తెలిసే లోపే సుమారు 20 అడుగుల లోయలోకి బస్సు బోల్తాపడింది. దీంతో యాత్రికుల హాహాకారాలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న బీఎస్‌ఎఫ్ జవాన్లు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన సిబ్బంది, వైద్య సిబ్బంది అంబులెన్సులతో చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అప్పటికే బాలిక, మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాదం జరిగిందిలా..

పూరీ జిల్లా అలిపాబజార్, కటక్ ప్రాంతాలకు చెందిన 65 మంది శనివారం కొరాపుట్ జిల్లాలో ప్రకృతి అందాలను తిలకించేందుకు శనివారం రాత్రి బయలుదేరారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన దాదాపు 20 మంది ఉన్నారు. చిన్నారులు, మహిళలు కూడా ఉన్నారు. ముందుగా దక్షిణ ఒడిశాలో సుప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వరుడిని దర్శించుకొని తర్వాత పర్యాటక ప్రాంతాలు తిలకించాలని ప్రణాళిక వేసుకున్నారు. గుప్తేశ్వర్ సమీపంలోని డొంకిరి ఘాట్ వద్ద బాలిపుట్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 5 గంటల 45 సమయంలో బస్సు అదుపు తప్పింది. అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టి దాదాపు 25 అడుగుల లోయలో పడింది. రామగిరికి 10 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగిందనే సమాచారం మేరకు రామగిరిలోని బీఎస్‌ఎఫ్ బెటాలియన్ క్యాంపు నుంచి జవానులు బయలుదేరారు. పోలీసులు, అంబులెన్స్‌లను రప్పించి క్రెయిన్ ద్వారా బస్సును బయటకు తీశారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి జయపురంలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. ఈ ఘటనలో బాలికతో పాటు మరో నలుగురు మరణించినట్లు సమాచారం. 20 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. బస్సు వెనుకభాగంలో మరి కొంతమంది ఇరుక్కునట్లు సమాచారం. ఇంకా మృతుల సంఖ్య పెరగవచ్చని తెలుస్తోంది. కొరాపుట్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, బొయిపరిగుడ పోలీసు అధికారులు సంఘటనాప్రాంతానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.



గాయపడిన వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల సాయం..

గుప్తేశ్వర్ ఘటన పట్ల ముఖ్యమంత్రి మోహన్‌చరణ మాఝి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



లోయలో నుండి బస్సును క్రైన్ ద్వారాతీస్తున్న సిబ్బంది



క్షతగాత్రుడిని లోయలో నుంచి తీసుకెళ్తున్న జవానులు



ఘటనా స్థలంలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ వర్మ



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రాబుగుడలో ఏనుగుల బీభత్సం

- ధాన్యం బస్తాలు ధ్వంసం



ఏనుగలు చెల్లాచెదురు చేసిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న బాధిత రైతులు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి ధమునిపొంగ పంచాయతీలోని రాబుగుడలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. శనివారం సాయంత్రం రెండు ఏనుగులు గ్రామంలోకి చొరబడి ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన మమిత బొరిషక, గోవింద బొర్షిక, సంతోష్ బొరిషకలకు చెందిన సుమారు 20 క్వింటాళ్ల ధాన్యాన్ని ఏనుగులు చెల్లాచెదురు చేశాయి. కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా పండించిన ధాన్యం తడిసిపోవడంతో వాటిని ఎండపెట్టిన అనంతరం బస్తాల్లో వేసి ఒక గుడిసెలో పెట్టారు. శనివారం సాయంత్రం రెండు ఏనుగులు చొరబడి గుడిసెను విరగ్గొట్టడంతో పాటు అందులో భద్రపరిచిన ధాన్యం బస్తాలను చెల్లాచెదురు చేశాయి. కొన్ని బస్తాల్లోని ధాన్యాన్ని తినేశాయి. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం ఏనుగుల పాలవ్వడంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలను సేకరించారు.

ఒకటి నుంచి రోడ్డు భద్రతా వారోత్సవాలు

- ఆర్టీవో శివశంకర్ చౌదరి



సమావేశంలో ఆర్టీవో చౌదరి, ప్రిన్సిపాల్ బబిలత షరఫ్ తదితరులు

రాయగడ: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి వారం రోజుల పాటు జిల్లాల్లో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆర్టీవో శివశంకర్ చౌదరి వెల్లడించారు. శనివారం సాయంత్రం ఈ మేరకు స్థానిక అటానమస్ కళాశాల సమావేశం హాల్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబిలత షరఫ్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, ఈడీఈవో భజన్‌లాల్ మాఝి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన పట్నాయక్, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ముందస్తుగా చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రతీ కళాశాల, పాఠశాలల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని పట్టణంలో చైతన్య ర్యాలీలు నిర్వహిస్తారని ఈ సందర్భంగా ఆర్టీవో చౌదరి అన్నారు. అలాగే ఆటో, లారీ డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలను నిర్వహించేందుకు శిబిరాలను నిర్వహిస్తామని వివరించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించడంతో పాటు అతివేగం ప్రాణాంతకమన్న అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తామన్నారు.

సాహితీ సంస్థ వార్షికోత్సవానికి సన్నాహాలు



సమావేశంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

జయపురం: జయపురంలో ప్రముఖ సాహితీ సంస్థ పూజపూజ్య సంసద్ తన 28వ వార్షికోత్సవాన్ని జరిపేందుకు విస్తృత సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆదివారం సంస్థ కార్యవర్గ సభ్యులు సన్నాహక సమావేశం నిర్వహించి చర్చించారు. పూజ పూజ్య సంసద్ అధ్యక్షులు ఉదయ శంకర జాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో వార్షికోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. జనవరి 27 నుంచి 31వ తేదీ వరకు వివిధ పోటీలు నిర్వహించాలని, సావనీర్ విడుదల చేయాలని తీర్మాణించింది. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆ పత్రిక ముద్రణ పూర్తి చేయాలని నిర్ణయించింది. అందుకు తమ అమూల్యమైన రచనలు, కవితలు కథలు, వ్యాసాలు మొదలగు రచనలు సభ్యులు, రచయితలు, సాహితీ వేత్తలు అందజేయాలని సభాముఖగా విజ్ఞప్తి చేశారు. 2025 మార్చి రెండో తేదీన వార్షికోత్సవం జరిపేందుకు సమావేశంలో సభ్యులు నిర్ణయించారు. సమాజంలో సాహిత్య, కళల, క్రీడలు, సమాజ సేవ, సాంస్కృతిక రంగాలలో ఉత్తమ సేవలు అందించిన వారిని ఘనంగా సన్మాణించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అటువంటి వ్యక్తుల పేర్లు అందజేయాలని ప్రతినిధులు కోరారు. వార్షికోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది. పూజపూజ సంసద్ ప్రధాన సలహాదారు, ఇంజినీర్, కేధార్ నాథ్ బెహెర, ఇంజినీర్ భాస్కర సామంతరాయ్, ఉపాధ్యక్షులు తపన కిరణ్ త్రిపాఠీ, సహాయ కార్యదర్శి మృత్యుంజయ సాహు, కోశాధికారి సరస్వతీ సాహు పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యాన్ని కొంటాం

- రైతులకు భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి
- గజపతి జిల్లాలో ఆకస్మిక పర్యటన
- ఉప్పలాడ, లింగుపురం రోడ్డు వద్ద భైఠాయించిన రైతులు



గురండి వద్ద పాడైన ధాన్యాన్ని ముఖ్యమంత్రికి చూపిస్తున్న రైతులు

పర్లాకిమిడి: అకాల వర్షాలకు రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభయమిచ్చారు. ఆదివారం గజపతి జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల శాఖ మంత్రి సురేష్ పూజారితో కలిసి సీఎం ఆకస్మికంగా పర్యటించారు. పర్లాకిమిడి నుంచి ఉప్పలాడ, లింగుపురం మీదుగా గురండి గ్రామం చేరుకుని అక్కడి రైతులతో మాట్లాడారు. పొలాల్లో పాడైన ధాన్యంపై ఆరా తీశారు. ఫసల్ భీమా యోజన పథకంలో ఎందుకు చేరడం లేదని రైతులను ప్రశ్నించారు. ప్రీమియం కట్టి ఉంటే పాడైన పంటకు రెట్టింపు పరిహారం అందేదని చెప్పారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిహారం అందించేందుకు క్యాబినెట్‌లో చర్చిస్తామని తెలిపారు. రంగు మారిన ధాన్యాన్ని తక్కువ ధరకైనా కొనుగోలు చేసే విషయమై ఆలోచిస్తామన్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో గురండి – లింగుపురం రోడ్డులో రైతులు ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో సీఎం కారు దిగగా రైతులు వినతి పత్రాన్ని అందించారు. గుసాని సమితిలో ఎక్కువగా పంట నష్టం జరిగిందని రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. పాటికోట– చందనకోలా– కేతాడ-బిత్తిసింగి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ నాయకులు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బల్ల ధనుంజయ విన్నవించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్లాకిమిడిలో గజపతి స్టేడియానికి చేరుకుని హెలికాప్టర్‌లో గంజాం జిల్లా ఛత్రపూర్‌కు పయనమయ్యారు. పర్యటనలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అధ్యక్షుడు కోడూరు నారాయణరావు, కలెక్టర్ బిజయకుమార్ దాస్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, గుసాని సమితి బీడీఓ గౌరచంద్ర పట్నాయక్, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలాడ, లింగుపురం-గురండి రోడ్డులో పాడైన ధాన్యంతో రైతుల నిరసన

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ తెప్ప రేవు గ్రామానికి చెందిన సాధు రామారావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి కేసును ఎచ్చెర్ల పోలీసులు ఆదివారం నమోదు చేశారు. ఆవులు మేపుకొని ఇంటికి వస్తుండగా, శనివారం సాయంత్రం సింహాచలం అనేవ్యక్తి తనపై రాయితో దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. గాయపడిన రామారావు శ్రీకాకుళం రూరల్ మండలం జమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు ఎచ్చెర్ల పోలీసులు ఆస్పత్రికి వెళ్లి గాయపడ్డ వ్యక్తి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ మహాసభలు


ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గాన్ని అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి: టెక్కలిలో జరుగుతున్న మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులను యూటీఎఫ్ నాయకులు బాబూరావు, టి.వైకుంఠరావు, కె.దాలయ్య అభినందించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారుడు బాబీ

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ సింగంవలస గ్రామానికి చెందిన చౌదరి చంద్రయ్య (65) ఆదివారం చోడసముద్రం గ్రామంలో అనుమానస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం చోడసముద్రం గ్రామంలో జరిగే ఒక ఫంక్షన్‌కు హాజరై పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో మృతి చెంది పడి ఉన్నాడు. గమనించిన ఆయన కుటుంబ సభ్యుడు చౌదరి రామలింగం పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. భార్య నరసమ్మ నాలుగేళ్ల క్రితం సారవకోటలో పొలం పనులకు వచ్చి పాముకాటుతో మృతి చెందింది.

ఎట్టకేలకు కేసు నమోదు

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కొత్తకుంకాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లంకలపల్లి శ్రీనువాసరావు ఇంట్లో శనివారం భారీగా మద్యం పట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే కేసు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయమై 'టీడీపీ కార్యకర్త ఇంట్లో భారీగా మద్యం పట్టివేత'' అనే శీర్షికతో సాక్షిలో ఆదివారం కథనం కూడా ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లంకలపల్లి శ్రీనువాసరావు భార్య లంకలపల్లి భవానీ వద్ద 35 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారులకు వివరాలు సమర్పించారు. ఈ మేరకు అక్రమ మద్యం కలిగినందుకు భవానీపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అనురాధదేవి తెలిపారు.

పోలీసుల తీరు సరికాదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీనియర్ న్యాయవాది, గతంలో డైరెక్టర్ ఆఫ్ ప్రోసిక్యూషన్‌గా పనిచేసిన జల్లా సుదర్శన్‌రెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు మండల కార్యాలయంలో తన తల్లి మండల అధ్యక్షులుగా ఉన్న కార్యాలయానికి వెళ్తే అక్కడ రాజకీయ కుట్రతో జరిగిన ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి అంటూ స్థానిక సీఐ సుదర్శన్‌రెడ్డి కాలర్ పట్టుకుని లాక్కుని వెళ్లడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. పోలీసులు వ్యవహరించిన తీరు చట్ట వ్యతిరేకంగా ఉందని, దీనిపై గవర్నర్ చొరవచూపి ఇటువంటి దాడులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య


ఎచ్చెర్ల: లావేరు మండలం రాయినింగారిపేట గ్రామానికి చెందిన జగ్గురోతు సత్యనారాయణ(30) మనస్థాపానికి గురై శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. వ్యక్తిగత కారణాల వలన తీవ్ర మనస్థాపానికి గురైన సత్యనారాయణ పొలం కోసం తీసుకొచ్చిన గడ్డిమందును తాగాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆయనను 108 వాహనంలో చికిత్స కోసం రిమ్స్ తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జగన్మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సహస్ర లింగాల సమాహారం..

కుటినిపాదొరొ శైవక్షేత్రం

- అడుగడుగునా శివలింగాలతో భక్తులకు కనువిందు
- పర్యాటక ప్రాంతంగానూ ప్రసిద్ధి
- పోటెత్తుతున్న భక్తులు


ప్రధాన శివలింగం


నంది


దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రామస్తుడు

రాయగడ: ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా వెయ్యి శివలింగాలు అక్కడ భక్తులకు స్వాగతం పలుకుతాయి. అడుగడుగున శివలింగాలు, చుట్టూ ఎత్తయిన కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంతో ఆ ప్రాంతం భక్తులకు కనువిందు చేస్తోంది. అదే కొరాపుట్‌కు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుటినిపాదొరొ శైవక్షేత్రం. ఈ గ్రామంలో అడుగడుగునా లింగాలు భక్తులకు కనువిందు చేస్తాయి. అత్యంత ప్రాచీనమైన ఈ ప్రాంతం నిత్యం సందర్శకులతో కిటకిటలాడుతుంటుంది. ముఖ్యంగా కార్తీక మాసంలో భక్తుల తాకిడి ఎక్కువ. ఇంచి ఎత్తు నుండి పది అడుగుల వరకు లింగాలు కనిపిస్తుంటాయి. ఇటు కొరాపుట్, మల్కనగిరి, నవరంగపూర్, రాయగడ జిల్లాలతో పాటు అటు విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి సందర్శకులు ఇక్కడికి వస్తుంటారు. ఆధ్యాత్మికంగా, పిక్నిక్ స్పాట్‌గా గుర్తింపు పొందిన ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం గుర్తించి పర్యాటకు ప్రాంతంగా అభివృద్ధి చెస్తే భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రత్యేకంగా స్థల పురాణం ఎవ్వరికీ తెలియని ఈ క్షేత్రంలో రాతితొ ఏర్పడిన శివలింగాలు దర్శనమిస్తాయి. స్వయంభూలింగాలుగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో గత ఏడాది సుమారు 5 లక్షల రుపాయల వ్యయంతో భక్తుల సౌకర్యార్థం మెట్లు ఏర్పాటు చేశారు. అయితే ఆలనాపాలన మాత్రం కరువయ్యింది. గ్రామస్తులే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్నాళ్ల కిందట చేపట్టిన మందిరం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. నిధుల కొరతతే దీనికి కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆనందంగా ఉంది..



ఎక్కువ లింగాలు కనిపిస్తాయని తెలిసి వచ్చాం. ఎంతో ఆనందంగా ఉంది. అభివృద్ధి జరగక ప్రాచుర్యంలోకి రాలేకపోతోంది. ఈ ప్రాంతంపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– ఎ.సుకన్య, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా

గంట సమయం..



ప్రాచీనమైన ఈ మందిరంలో ఎన్నో శివలింగాలు దర్శనమిస్తున్నాయి. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది. అన్ని శివలింగాలను దర్శనం చేసుకునేందుకు గంట సమయం పడుతుంది.

– లక్ష్మీనారాయణ, శ్రీకాకుళం

అభివృద్ధి చేయాలి..



ఇక్కడి వాతావరణం బాగుంటుందని కుటుంబంతో కలిసి వచ్చాం. శివలింగాలు చూడముచ్చటగా ఉన్నాయి. ప్రాచీనమైన ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలి.


– పి.సుజాత, పర్యాటకురాలు, శ్రీకాకుళం


కాపాడుకోవాలి..



కార్తీక మాసంలో తప్పకుండా ఈ క్షేత్రానికి వస్తుంటాం. సహస్ర లింగాలను దర్శించుకుని ఆనందిస్తుంటాం. పురాతన మందిరాలను కాపాడుకొని మన సంప్రదాయాలను గౌరవించాలి. – సంజులత పాత్రొ, రాయగడ


మందిరానికి వెళ్లే మెట్ల దారి


భారీ రాతి వినాయక విగ్రహం


గుహ


శివలింగాలు


రెండు భారీ శివలింగాలు

నడి సరస్సులో నిలిచిన నావ



ప్రయాణికులతో వెళ్తున్న పడవ చిలికా సరసు నడిబొడ్డున నిలిచిపోయింది. ఆదివారం ఉదయం సాంకేతిక సమస్య ఏర్పడటంతో నొంయిషాకుదొ తీరం సమీపంలో పడవ చిక్కుకుపోయింది. దీంతో 50 మంది ప్రయాణికులు బిక్కుబిక్కుమంటు గంట పాటు ఆందోళనకు గురయ్యారు. – భువనేశ్వర్

కొరాపుట్ జిల్లాలో దర్శకుడు రాజమౌళి

- మహేష్‌బాబు చిత్రం కోసం లొకేషన్ల వేట


రాజమౌళికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

కొరాపుట్: ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు రాజమౌళి కొరాపుట్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆదివారం సిమిలిగుడలో ఓ హోటల్లో బసచేశారు. నటుడు మహేష్‌బాబుతో కలిసి తెరకెక్కనున్న భారీ బడ్జెట్ సినిమా కోసం కొరాపుట్‌లో లొకేషన్లు పరిశీలిస్తున్నారు. విశాఖ నుంచి ఐదుకార్లతో రాజమౌళి బృందం తరలివచ్చింది. దేవమాలి, కొలాబ్, గుప్తేశ్వరం, మాచ్‌ఖండ్, పుట్‌సీల్, పుంజ్‌సీల్, తోలో మాలీ తదితర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. వాస్తవానికి ఒక్క రోజులో చూసి వెళ్లిపోవాలని జక్కన్న అనుకున్నప్పటికీ కొరాపుట్ జిల్లాలో దండకారణ్యం లొకేషన్లు నచ్చి మరో రోజు సిమిలిగుడలో బస చేయనున్నట్లు తెలిసింది.

శ్రీమందిర సింహద్వార

ప్రాంగణానికి వెండి తాపడం



పూరీ జగన్నాథ మందిరం సింహద్వారం ఆవరణలో 22 మెట్ల అనుసంధాన ద్వారానికి త్వరలో వెండి తాపడంతో కొత్త శోభని తీర్చిదిద్దనున్నారు. ఈ పనులు ప్రారంభమైనట్లు ప్రకటించారు. యమ శిల, పతిత పావనుడు పరిసరాల్లో వెండి తాపడం చేయాలని శ్రీ మందిరం పాలక మండలి నిర్ణయించింది. – భువనేశ్వర్

అన్నదాతకు ఓదార్పు

- రంగంలోకి దిగిన సీఎం, మంత్రులు
- సాయం అందిస్తామని భరోసా


పంట నష్టం వివరాలు తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్


ముఖ్యమంత్రికి పంట నష్టం గోడు వినిపిస్తున్న రైతులు


ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిదా సమక్షంలో బోరుమన్న రైతు


బాధిత రైతు గోడు వింటున్న స్పీకర్ సురమా పాఢి

భువనేశ్వర్: అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లడంతో తల్లడిల్లుతున్న రైతాంగానికి నష్ట పరిహారం అందించే ప్రక్రియ నత్తనడకన సాగుతోందనే విమర్శల వేల రాష్ట్ర ప్రభుత్వం మేల్కొంది. ముఖ్యమంత్రి, స్పీకర్‌తో సహా మంత్రులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో మాట్లాడి వారి భరోసా కల్పిస్తున్నారు. కాగా, గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఈసారి వరి కొనుగోలు కనీస మద్దతు ధరతో సాగు పెట్టుబడి కింద అదనపు మొత్తంతో ప్రతి క్వింటాలు వరి కోసం ప్రభుత్వం రూ.3,100 ప్రకటించింది. ఎన్నికల హామీ నెరవేర్చమనే ఆనందంతో ఉన్న వేళలో అకాల వర్షాలు మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వం ఉత్సాహం నిలువునా నీరు గారిపోయింది. బాధిత రైతాంగానికి ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, క్షేత్రస్థాయిలో రైతాంగం బాధల్ని పంచుకునేందుకు విపక్ష బిజూ జనతా దళ్ శంఖారావం చేసింది. ఈ నెల 31న ప్రభావిత ప్రాంతాల్లో పొలాలు సందర్శించి రైతు ఓదార్పుకు విపక్ష నేత నవీన్ పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రకటించింది. ప్రధానంగా పంట నష్టం అంచనాలో ఎటువంటి లోపాలు లేకుండా పటిష్టంగా నిర్వహిస్తే తప్ప బాధిత రైతాంగానికి ఏమాత్రం మేలు జరగదని విపక్ష బీజేడీ ఒత్తిడి పెంచింది. క్షేత్రస్థాయిలో రైతాంగంతో ప్రత్యక్షంగా భేటీ అయి బాగోగుల్ని సమీక్షిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. విపక్షం కంటే ముందుగా పంట నష్టం బాధితులను కలిసేందుకు ముఖ్యమంత్రితో సహా పలువురు మంత్రులు ఆదివారం ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో పంట నష్టాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదివారం నయాగడ్ జిల్లాలో పర్యటించి రైతులతో మమేకమయ్యారు. స్పీకర్ సురమా పాఢి పీడిత రైతాంగాన్ని ఓదార్చారు. కటక్ జిల్లా నియాలీ మండలంలో వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ సందర్శించారు. తిర్తోల్, కుజంగ్ మండలాలు పర్యటించి పంట నష్టం తీవ్రతని పరిశీలించారు.

రేపు విపక్షం ఓదార్పుయాత్ర..

రాష్ట్రంలో ఎనిమిది రోజుల్లో పంట నష్టం కారణంగా నలుగురు రైతులు మరణించారని ప్రతిపక్ష బిజూ జనతా దళ్ ఇటీవల ఆరోపించింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా వ్యవసాయ ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. ఈ నెల 31న పూరీ, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జిల్లాల్లో ప్రభావిత రైతాంగంతో కలిసి పంట నష్టం పొలాలు పరిశీలిస్తారు.

ఘనంగా లాయర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

మల్కన్‌గిరి: ఆల్ ఒడిశా లాయర్స్ అసోసియేషన్ 53వ వార్షికోత్సవాన్ని మల్కన్‌గిరి జిల్లా కేంద్రం డీఎన్‌కే క్రీడా మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శివ శంకర్ మిశ్రో, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాల్ గౌడ్, ఒడిశా బార్ అసోసియేషన్ కౌశల్ చైర్మన్ శితేష్ మోహన్ దివ్యేధి, ఒడిశా బార్ అసోసియేషన్ కౌసిల్ వైస్‌చైర్మన్ రాజీవ్ మహంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థకు న్యాయవాదులే వెన్నెముక అన్నారు. కక్షిదారులకు న్యాయం అందించడంలో న్యాయవాదులే కీలకమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శివ శంకర్ మిశ్రో అన్నారు. బలహీనవర్గాల వారికి న్యాయవాదులు అండగా ఉండాలన్నారు. ప్రతి జిల్లాలో న్యాయ సహాయ శిబిరాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఒడిశాలో ఉన్న 30 జిల్లాల్లో ఉన్న న్యాయవాదులు ఈ సందర్భంగా కొన్ని డిమాండ్లను ప్రస్తావించారు. ఉచిత బీమా, ఉచిత విద్య, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. మల్కన్‌గిరి లాయర్స్ అసోసియేషన్ సభ్యులు లాంబోధర్ తురాక్ నృసింగ్ చరణ్ మహంతి, రాజేష్ పట్నాయక్ పాల్గొన్నారు.


వేదికపై అతిథులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు రాష్ట్ర న్యాయమూర్తి శివశంకర్ మిశ్రో


హాజరైన న్యాయవాదులు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీవారి పుష్పయాగం



పుష్పయాగం అలంకరణలో శ్రీనివాసుడు

విజయనగరం టౌన్: స్థానిక రింగురోడ్డు టౌన్ సెంటర్ లేఅవుట్‌లో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 14వ పాశురం నిర్వహించారు. స్వామివారికి పుష్పయాగం, పుష్పాంజలి నిర్వహించారు. వేకువజామునుంచి నగర సంకీర్తన చేశారు. ఆలయ అర్చకులు శ్రీమన్నారాయణాచార్యులు, రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో గోదాదేవికి విశేష పూజలు చేశారు. శ్రీనివాససేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చెరుకూరి శ్రీధర్ నేత్రత్వంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో బాలకుమార్ ప్రతిభ



సాధించిన ట్రోఫీతో పెదగాడ బాలకుమార్

విజయనగరం: అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో విజయనగరానికి చెందిన క్రీడాకారుడు పెదగాడ బాలకుమార్ సత్తా చాటాడు. ఇటీవల జరిగిన ఇండో నేపాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ పాటవాలు కనబరిచిన కుమార్ బంగారు పతకం దక్కించుకుని విజయనగరం ఖ్యాతిని చాటిచెప్పాడు. బాలకుమార్ సాధించిన ప్రతిభకు గాను జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో మరిని పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయస్థాయి పోటీలకు బీసీ గురుకుల విద్యార్థి



విద్యార్థి కర్రిప్రదీప్‌ను అభినందిస్తున్న యూనివర్సిటీ నిర్వాహకులు

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో ఉన్న మహాత్మాజ్యోతిపూలే బీసీ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి కర్రి ప్రదీప్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 27,28వ తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన జూడో ఫెడరేషన్ ఆఫ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం గోల్డ్ మెడల్ సాధించాడు.దీంతో జనవరి 18,19,20 తేదీల్లో జాతీయ స్థాయిలో పూణెలో జరగనున్న పోటీల్లో జూడో సబ్‌జూనియర్ విభాగంలో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోత్తం తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థి కర్రి ప్రదీప్‌ను పీడీ అప్పలనాయుడు, ఇతర ఉపాధ్యాయ,సిబ్బంది అభినందించారు.

వరి యంత్రం కింద పడి విద్యార్థి మృతి



మణికంఠ (ఫైల్)

బొబ్బిలిరూరల్: మండలంలోని గున్నతోటవలస గ్రామానికి చెందిన విద్యార్థి సాలాపు మణికంఠ ప్రమాదవశాత్తు వరి యంత్రం కింద పడి మృతిచెందాడు. ఆదివారం జరిగిన ఈ ఘటన తల్లిదండ్రులను తీవ్ర విషాదంలో ముంచేసింది. మృతుడి తండ్రి సాలాపు శంకరరావు ఆటోడ్రైవర్ విధులు నిర్వర్తించుకుని మధ్యాహ్నం కుటుంబంతో సహా గ్రామంలో వరినూర్పు చేసే యంత్రంతో వరినూర్పు పూర్తిచేశాడు. అనంతరం అక్కడ సమీపంలో ఉన్న రాణి గారి తోటలో వరినూర్పిడికి సిద్ధమవుతుండడంతో సదరు యంత్రాన్ని రావాల్సిందిగా చెప్పడంతో ట్రాక్టర్ డ్రైవర్ యంత్రంతో బయలు దేరాడు. ఇంతలో ఆ వరినూర్పుడు యంత్రం ఉన్న ట్రాక్టర్‌పై బయల్దేరిన శంకరారావు పిల్లలు చిన్నారి మణికంఠ, తమ్ముడు పార్థుతో పాటు మరో చిన్నారి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ఇద్దరు ట్రాక్టర్ నుంచి దూరంగా పడిపోగా మణికంఠ నూర్పిడి యంత్రం క్రింద పడిపోయి నలిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు యంత్రాన్ని వెలికి తీసి మణికంఠ మృతదేహాన్ని బయటకు తీశారు. 108కు ఫోన్ చేసి మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఏఎస్సై భాస్కర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మణికంఠకు తల్లి పోలమ్మ, అక్క దీప, ఎల్‌కేజీ చదువుతున్న తమ్ముడు పార్థు ఉన్నారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న

- జిల్లాలో అత్యధికంగా పూసపాటిరేగలో సాగు
- క్వింటాకు రూ.2100కు పైగా ఘద్దతు ధర
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు



కొల్లాయివలసలో సాగవుతున్న మొక్కజొన్న

పూసపాటిరేగ: మొక్కజొన్న రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. సాగులో అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రావడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్నసాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం అమాంతం పెరుగుతోంది. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి సుమారు 20 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు అవుతుండగా ఒక్క పూసపాటి రేగ మండలంలోనే 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, బొండపల్లి, గజపతినగరం, గంట్యాడ, ఎస్.కోట, నెల్లిమర్ల మండలాల్లో అత్యధికంగా మొక్కజొన్న సాగు జరుగుతోంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఎకరా సాగు విస్తీర్ణానికి రూ.10 వేలు ఖర్చు అయితే 40 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి వస్తుందని పూసపాటిరేగ పరిసర ప్రాంతాలు రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించడంతో సాగుపై మరింత మంది రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. క్వింటా మొక్కజొన్నకు 2100 పైబడి ధర పలకడంతో ఎక్కువ మంది రైతులు సాగుపై దృష్టిసారించారు. పూసపాటి రేగ ప్రాంతంలో గల కొప్పెర్లలో విజయనగర్ బయోటెక్‌తో పాటు ప్లాంట్లు మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో మొక్కజొన్నకు బాగా గిరాకీ పెరిగింది.

సాగు విస్తీర్ణం పెరిగింది



పూసపాటిరేగ ప్రాంతంలో మొక్కజొన్న సాగుపైనే అధిక సంఖ్యలో రైతులు ఆధారపడి ఉన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని రైతులు ఆర్జిస్తున్నారు. ఎకరాసాగుకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చయితే రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. మొక్కజొన్న పంటను పరిశ్రమలే కొనుగోలు చేస్తునాయి.

తాడిశెట్టి సూర్యనారాయణ,
మొక్కజొన్న రైతు, మర్రిపేట

మొక్కజొన్నతో అధిక లాభాలు

మొక్కజొన్న సాగులో దిగుబడి పెరిగితే లాభాలు వస్తాయి.రైతు వద్దకే వ్యాపారులు వచ్చి పంటను కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న వినియోగం పెరగడంతో పరిశ్రమల యాజమాన్యాలు రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నాయి. విత్తనాలు రాయితీపై సరఫరా జరగడంతో మరింత మంది రైతులు మొక్కజొన్న సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

పతివాడ భాస్కరరావు, రైతు, పతివాడ

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

సాక్షి ఎఫెక్ట్



గుర్ల: మండలంలోని గోవు పేటలో కుళాయిల ద్వారా నలుపు రంగు నీరు రావడంతో 'ఇది తాగునీరే ..నమ్మండి' అనే శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గోవు పేటలోని రక్షిత మంచినీటి పథకాన్ని శుభ్రపరిచారు. క్లోరినేషన్ చేయించారు. గోవుపేట ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నట్లు సర్పంచ్ ఎజ్జిపరుపు లక్ష్మణరావు తెలిపారు.

ఘనంగా మృత్యుంజయ హోమం



గోవిందపురం ముక్తిధాం క్షేత్రంలో మృత్యుంజయ హోమంలో పాల్గొన్న భక్తులు

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో మృత్యుంజయ హోమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వందల సంఖ్యలో జంటలు హాజరయ్యారు. ముక్తిధాం క్షేత్రం అధినేత పోతినిండి అనంతబాబు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛారణలతో హోమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి జంటలు హాజరై హోమంలో పాల్గొన్నారు. ఉదయం 4 గంటల నుంచి సహస్ర పార్థివ లింగార్చన, మహారుద్రాభిషేకం, ఫలోదక విశేష అభిషేక ద్రవ్యాలతో రుద్రనమక చమక, మన్యుసూక్త పంచసూక్త మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది. ఉదయం 11 గంటల సమయంలో మహామృత్యుంజయ హోమం ప్రారంభించారు. సాయంత్రం 4 గంటల సమయంలో మహాపూర్ణాహుతి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి మాణిక్యాంబ సమేత అనంత లింగేశ్వర స్వామి కల్యాణం చేశారు. కార్యక్రమంలో గోవిందపురం, పతివాడ సర్పంచ్‌లు బాలా రామలక్ష్మి, ఆకుల పైడిరామ్, ఎంపీటీసీ దంగుడుబియ్యపు సునీత, విక్రం జగన్నాథం, కంది వెంకటేశ్వర్రావు, మీసాల జయరాం, పట్టిపు వెంకటరావు, డి.ఈశ్వర్రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలను సందర్శించిన కలెక్టర్



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న కలెక్టర్ ఫ్యామిలీ



షూటింగ్ చేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్



ఆర్చరీలో పాల్గొన్న కలెక్టర్

సీతంపేట: విధినిర్వహణలో అనునిత్యం బిజీగా ఉండే కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదివారం సీతంపేట ఏజెన్సీలో పలు పర్యాటక ప్రదేశాల్లో కుటుంబసభ్యులతో గడిపారు. స్థానిక అడ్వెంచర్ పార్కులో పలు సాహస క్రీడల్లో పాల్గొని ఆనందించారు. ఆర్చరీ, షూటింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జి వంటి వాటిపై నడిచి ఆనందించారు. అలాగే బెనరాయి జలపాతాన్ని సందర్శించారు.

కంది కొత్తల ఉత్సవాల్లో అపశ్రుతి



సాంబారు అండాలో పడి గాయాలపాలైన ఎస్.రమేష్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండ్ వద్ద ఆదివారం నిర్వహించిన కందికొత్తల ఉత్సవాల్లో అపశ్రుతి నెలకొంది. కందికొత్తల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన వందలాది మంది గిరిజనులు స్థానిక హెచ్ గ్రౌండ్ వద్ద కందికొత్తల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల అనంతరం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమాల్లో భోజనం ఆరగించేందుకు లైన్లో నిలబడిన చెముడుగూడ గ్రామానికి చెందిన ఎస్.రమేష్ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సాంబారు అండాలో పడిపోయాడు. సాంబారు వేడిగా ఉండడంతో రమేష్ ఒళ్లంతా కాలిపోగా కమిటీ సభ్యులు హుటాహుటిన కూతవేటు దూరంలో ఉన్న భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సేవలందించారు. మెరుగైన వైద్యంకోసం అక్కడి వైద్యులు రమేష్‌ను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అప్పటి వరకూ ఎంతో ఉల్లాసంగా తమతో కలిసి ఉత్సవంలో పాల్గొన్న రమేష్‌కు ఇంతటి ప్రమాదం జరగడం పట్ల కుటుంబీకులు, గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆందోళన వెలిబుచ్చారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల విజేతలకు అభినందన



మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు


విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను ఎమ్మెల్సీ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు అభినందించారు. ఈనెల 14,15 తేదీల్లో కృష్ణ జిల్లా గుడివాడలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పతకాలు సాధించగా..వారిని ఆదివారం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో కూడా మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు వెళ్లిన విజయనగరం జిల్లా టీమ్‌కు కోచ్,మేనేజర్‌గా వ్యవహరించిన ఎస్.కోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ పోటీలలో 16 మంది స్త్రీలు, 34 మంది పురుషులు పాల్గొనగా మొత్తంగా 144 బంగారు, వెండి, కాంస్య పతకాలు సొంతం చేసుకుని విజయనగరం జిల్లాకు మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో తిరుగులేదని నిరూపించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులందరూ సాధించిన పతకాలతో హాజరయ్యారు.

ఢిల్లీలో క్రీడా పోటీలకు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు

- వచ్చే నెల 3 నుంచి ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీలు



సారిపల్లి గౌరీశంకర్



భాను కుర్మాన



పైడి నరేష్



పీఎల్‌పీ కుమార్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జిల్లాకు చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు అర్హత సాధించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం నలుగురు వ్యాయామ ఉపాధ్యాయులు వచ్చే నెల 3 నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారిలో గుణుపూరుపేట వ్యాయామ ఉపాధ్యాయుడు సారిపల్లి గౌరీ శంకర్ (కబడ్డీ), రఘుమండ వ్యాయామ ఉపాధ్యాయిని భాను కుర్మాన (కబడ్డీ), పెదవేమలి వ్యాయామ ఉపాధ్యాయుడు పీఎల్‌పీ.కుమార్ (ఖోఖో), సంతకవిటి మండలం మామిడిపల్లిలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పనిచేస్తున్న పైడి నరేష్ (కబడ్డీ) క్రీడాంశాల్లో ఉన్నారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలలో రాష్ట్ర జట్టు తరఫున విజయనగరం జిల్లా ఉపాధ్యాయులు పాల్గొంటారని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు అర్హత సాధించిన వ్యాయామ ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యాల నాయుడు, ఉప విద్యాశాఖ అధికారి రమణ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావులు అభినందించారు.

కానిస్టేబుల్ ఉద్యోగనియామకాలకు సర్వం సిద్ధం

- అభ్యర్థులకు నేటి నుంచి జనవరి 22 వరకూ పరీక్షలు
- ఎస్పీ వకుల్ జిందల్



వకుల్ జిందల్,
ఎస్పీ విజయనగరం

విజయనగరం క్రైమ్: జిల్లాలో స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు పీఎంటీపీఈటీ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ప్రక్రియలో భాగంగా జిల్లాలో 9152 మంది అభ్యర్థులకు పీఎంటీపీఈటీ పరీక్షలను డిసెంబర్ 30 నుంచి జనవరి 22 వరకూ పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. సెలక్షన్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తిచేశామన్నారు. ప్రతిరోజూ 600 మంది అభ్యర్థులకు ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే జరుగుతుందని, ఎటువంటి అవకతవకలకు తావులేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు వారికి నిర్దేశించిన తేదీన, ఉదయం 4 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులను కల్పించడంతో పాటు, అవసరమైతే వైద్యసహాయాన్ని అందించేందుకు మెడికల్, పారామెడికల్, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. సెలక్షన్ ప్రక్రియ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ సూచించిన ఆదేశాలతో ఒక క్రమ పద్ధతిలో, నిష్పక్షపాతంగా చేపడతామన్నారు. 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగు నిర్వహించడంలో అభ్యర్థులకు ఆర్‌ఎఫ్ఐడి (రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ డివైజ్) ట్యాగ్‌లను అమర్చి, అభ్యర్థులు ఎన్ని నిమిషాలు, ఎన్నిసెకన్లలో పరుగును పూర్తిచేసింది, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను, ఒక సెట్ అటెస్టేషన్ చేసిన జిరాక్స్ సెట్‌ను తప్పనిసరిగా తీసుకుని ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని పేర్కొన్నారు. పీఎంటీపీఈటీ పరీక్షలను పాస్ చేయిస్తామని, కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మవద్దని, ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రతిభ ఆధారంగానే జరుగుతుందన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎస్పీ హితవు పలికారు.

ఎయిర్‌టెల్ టవర్‌లో చోరీ

భామిని: మండల కేంద్రంలోని ఎయిర్‌టెల్ సెల్ టవర్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఎయిర్ టవర్‌లోని బ్యాటరీలు దొంగిలించే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు రావడంతో పరారయ్యారు. అయితే దొంగలు తెచ్చిన స్కూటీ స్థానికులకు చిక్కింది. స్థానికులకు దొరికిన దొంగల స్కూటీని ఆటోలో బత్తిలి పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం అప్పగించారు. కాగా భామిని ఎయిర్‌టెల్ టవర్‌లో ఉన్న ఇరవై బ్యాటరీలు దొంగలించడానికి ముగ్గురు తస్కరులు ప్రయత్నించినట్లు స్థానికులు చెప్పారు. గతంలోనూ బాలేరు, కొత్తూరు మండలం గూనభద్ర టవర్‌లోని బ్యాటరీలు దొంగిలించినట్లు చెబుతున్నారు. భామిని ఎయిర్ టెల్‌టవర్‌లో బ్యాటరీలు దొంగిలిస్తుండగా ఎయిర్‌టెల్ హెడ్‌ఆఫీస్‌లో అలారం మోగినట్లు తెలియవస్తోంది. వెను వెంటనే స్థానిక కరెంట్ కార్యాలయానికి, స్థానికులకు ఎయిర్‌టెల్ సిబ్బంది అప్రమత్తం చేయడంతో దొంగతనం తప్పిపోయిందని తెలుస్తోంది.

రూ.20 లక్షల ఆస్తినష్టం

- బాధితులకు పరిహారం అందజేత



పూర్తిగా కాలిపోయిన గుడిసెలు

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 11 పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయని, దాదాపు రూ.20 లక్షల పైబడి ఆస్తి నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ సత్యం ఆదివారం తెలిపారు. ఈ ప్రమాదంలో మంతిరెడ్డి ముద్దమ్మకు చెందిన రూ.10 లక్షలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆమె కుమార్తె ఈసు వివాహం ఏప్రిల్ 18వ తేదీన ఉండడంతో కట్నం కోసం రూ.10 లక్షల నగదుతో పాటు, కొన్న బంగారు వస్తువులను ఇంటిలో బీరువాలో ఉంచగా బయటకు తెచ్చేందుకు అవకాశం లేకపోవడంతో మొత్తం డబ్బులు, బంగారం కాలిపోయాయి.

బాధితులకు ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు గ్రామానికి చేరుకుని సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకున్నారు. అనంతరం బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు, ఒక బియ్యం బస్తాను అందించారు. కార్యక్రమంలో బొద్దూరు ఎంపీటీసీ వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలిలో నమ్మకమైన ప్రాతినిధ్యం ఉండాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో నమ్మకమైన ప్రాతినిధ్యం ఉండాలని ఆ దిశగా అభ్యర్థిని ఎన్నుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవులు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఏపీటీఎఫ్ ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగం సమస్యలను పరిష్కరించడానికి ఓపిక, సహనం ఉండాలని అలాంటి వ్యక్తినే ఎన్నుకోవాలని సూచించారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన నుంచి విద్యారంగంలో ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పోరాటాన్ని శాసనమండలి ద్వారా ప్రభుత్వానికి తెలియజేయడానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన అనుభవం ఉన్న గాదె శ్రీనివాసులునాయుడు సమర్థుడని సంఘం రాష్ట్ర కమిటీ గుర్తించిందని తెలిపారు. ఉపాధ్యాయుల పక్షాన నిలిచి వారి మధ్యనే తిరిగే వ్యక్తిగా ఆయన గెలుపు అవసరమని పేర్కొన్నారు. మార్చిలో జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపునకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ పోటీ అభ్యర్థి గాదె శ్రీనువాసులు నాయుడు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం కోసం అందరి సహకారంతో ఉద్యమించి పోరాటం చేసి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు, సహాధ్యక్షులు సీహెచ్ దిలీప్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా గౌరవ అధ్యక్షుడు టి.చలపతిరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రవి, బి.వెంకటేశ్వర్లు, పార్వతీపురం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనుంజయ నాయుడు, పి.కూర్మినాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలరామ నాయుడు, ఎస్‌వీపైడిరాజు, విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ సంఘం (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడ గణపతిరావు హాజరై గాదె శ్రీనివాసరావుకు గెలుపునకు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మద్దతు లేఖలను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎం.కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు వి.రవీంద్ర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్ బంకపల్లి శివప్రసాద్, భైరి అప్పారావు, ఆర్.రాంబాబు, మురళి, అల్తి రాంబాబు తదిరులు పాల్గొన్నారు.

నేడు శంబర చేరుకోనున్న పెదపోలమాంబ

మక్కువ : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ మేనత్త పెద పోలమాంబ అమ్మవారు సోమవారం శంబర గ్రామానికి చేరుకోనుంది. సోమవారం నుంచి శంబర గ్రామంలో పోలమాంబ అమ్మవారి జాతర శోభ సంతరించుకోనుంది. పెద్దమ్మవారిని గ్రామానికి తీసుకొచ్చేందుకు దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పెద్దమ్మవారిని సోమవారం గ్రామంలోని పెద్దమ్మ వారి గద్దెకు తీసుకొని వస్తారు. మంగళవారం అమ్మవారు విశ్రాంతి తీసుకుని బుధవారం నుంచి గ్రామంలోని భక్తులకు అమ్మవారి దర్శనమిస్తారు. వచ్చే జనవరి 6న తొలేళ్ల ఉత్సవం, 7న పెద్దమ్మ వారి పండగ, 8న అనుపోత్సవం నిర్వహిస్తారు. అదే రోజు శంబర పోలమాంబ అమ్మవారిని కొని తెచ్చేందుకు చాటింపు వేస్తారు. వచ్చే ఏడాది జనవరి 27, 28, 29 తేదీలలో పోలమాంబ అమ్మవారు జాతర నిర్వహిస్తారు.

నేడు మెగాజాబ్ మేళా..

గజపతినగరం: స్థానిక సాయిసిద్ధార్థ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శీరంరెడ్డి పెద్దినాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. హెట్రో ఫార్మా(నక్కపల్లి హైదరాబాద్), డెక్కన్ ఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మా(విజయనగరం,విశాఖ, శ్రీకాకుళం), నవత ట్రాన్స్‌పోర్ట్, పేటీఎం, యకోహోమా తదితర 9రకాల కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు రారున్నారని అన్నారు. ఈ కంపెనీల్లో వెయ్యి ఖాళీ పోస్టులు ఉన్నాయని వాటిని భర్తీ చేసెందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని నిరుద్యోగ యువతీ యువకులు అంతా సోమవారం ఉదయం 10గంటలకు సాయిసిద్ధార్థ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలకు హాజరై అవకాశాన్ని వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు.

మెగాజాబ్ మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు మూడుసెట్‌లు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని అన్నారు. కార్యక్రమానికి ప్రోగ్రామ్ ఆర్గనైజర్ కోట్ల సుగుణాకరరావు, హెచ్‌ఆర్ రామునాయుడు, అబ్దుల్ కలాం సేవాసమితి, చేయూత ఫౌండేషన్ తదితరులు అంతా హాజరు కానున్నట్లు డాక్టర్ పెద్దినాయుడు తెలిపారు.